
సాక్షి గుంటూరు

శుక్రవారం ; 25 ; ఆగస్టు ; 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2140 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 521.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఎస్ఐ అభ్యర్థుల ఫిజికల్ పరీక్షలు రేపటికి వాయిదా



ఐజీ పాలరాజు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరగాల్సిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఒక్క రోజు వాయిదా వేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ నెల 25న పరీక్షలు జరగాల్సిన వారికి సెప్టెంబర్ 16న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఐజీ వివరించారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎస్పీ



నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. గ్రౌండ్‌లో ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న దృష్ట్యా వర్షాల వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు, డీఎస్పీలు చంద్రశేఖర్, బాలసుందరరావు, రేంజ్ ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

28న తెలుగు భాషపై చర్చావేదిక

నరసరావుపేట ఈస్ట్: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి 160వ జయంతిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 5 గంటలకు పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రెండు వేల సంవత్సరాల తెలుగు భాషా వైభవం అనే అంశంపై చర్చావేదిక ఏర్పాటు చేసినట్టు వివరించారు. చర్చావేదికలో పలువురు భాషా పండితులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాభిమానులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో డ్రైవర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 102 జిల్లా అధికారి సి.హెచ్.రాజేష్ చంద్ర తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్స్, హెవీలైసెన్సు బ్యాడ్జి కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అసక్తి, అర్హత ఉన్నవారు 9642677337 నంబరులో సంప్రదించాలన్నారు.

రవాణా వాహనాలకు స్పీడ్ గవర్నర్ తప్పనిసరి

నెహ్రూనగర్: రవాణా వాహనాల అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గవర్నర్ తప్పనిసరి అని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 8 మంది సీటింగ్ కెపాసిటీ వాహనాలకు గరిష్ఠంగా 80 కిలో మీటర్ల స్పీడ్ గవర్నర్, ఇక డంపర్లు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు, ప్రమాదకర వస్తువులను తీసుకువెళ్లే రవాణా వాహనాలు గంటకు 60 కిలోమీటర్ల స్పీడ్ గవర్నర్ అమర్చుకోవాలన్నారు. వాహన యాజమానులు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరించే సమయంలో స్పీడ్ గవర్నర్ తప్పనిసరిగా అమర్చబడి ఉండాలన్నారు. స్పీడ్ గవర్నర్ లేకపోతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడం జరగదన్నారు.

కొండపల్లి బొమ్మల విక్రయ కేంద్రం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం స్ఫూర్తి పథకం ద్వారా కొండపల్లిలో నిర్మించిన కొండపల్లి బొమ్మల విక్రయ కేంద్రాన్ని ఎంపీ కేశినేని నాని, కలెక్టర్ ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.172.50 కోట్లు కేటాయించింది. కళాకారుల కంట్రిబ్యూషన్, భవన నిర్మాణానికి ఎంపీ నాని తన నిధుల నుంచి రూ.55 లక్షలు మంజూరు చేయించారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ నిపుణులు బొమ్మల తయారీలో కళాకారులకు అధునాతన శిక్షణ ఇవ్వడంతో పాటు బొమ్మల విక్రయానికి ఈ భవనం అనువుగా ఉంటుందని ఎంపీ తెలిపారు.

అవినీతి అప్రతిష్ట

- పోలీసుశాఖ అభాసుపాలు
- ఎస్‌బీలో పాతుకుపోయిన సిబ్బంది లాలూచీలు
- పేకాట, లాటరీ, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో భారీగా వాటాలు
- రేషన్ మాఫియాకు అండదండలు
- తీగలాగితే కదిలిన అక్రమాల డొంక
- ఉన్నతాధికారులు సీరియస్



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అసాంఘిక కార్యకలాపాలు జరిగితే నిఘా పెట్టి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిన స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అందిన కాడికి దోచుకోవటమే పనిగా పెట్టుకున్న కొంత మంది అధికారులు వారికి అండగా నిలిచిన మరికొందరు ఉన్నతాధికారుల తీరుతో గుంటూరు జిల్లా పోలీసు శాఖ అప్రతిష్ట పాలైంది. ఇటీవల కాలంలో వీఆర్‌కు వెళ్లిన సీఐ ఉదంతంలో తీగ లాగితే డొంక కదిలినట్లు విచారణలో నిజాలు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయని తెలుస్తోంది. ఈ అంశాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుని విచారణ ముమ్మరం చేయటంతోపాటు, పేకాట, సింగిల్ నంబర్ లాటరీ, రేషన్ మాఫియాకు సహాయ సహకారాలు అందించిన వారిపై దృష్టిసారించినట్టు సమాచారం.

మనోడేలే.. వదిలేయ్..

ఇటీవల గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో విజిలెన్స్ అధికారులు ఒక రైస్ మిల్లుపై దాడి చేసి భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అయితే ఈ విషయంపై ఎస్‌బీ అధికారులు అప్పటికే రేషన్ మాఫియాతో ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో స్టేషన్‌లోని ఓ ఎస్ఐ స్థాయి అధికారికి ఫోన్ చేసి మరీ మనోడేలే.. వదిలేయ్ అంటూ హుకుం జారీచేయటంతోపాటు, మరోసారి అటువైపు వెళ్లవద్దని చెప్పటం గమనార్హం.

స్టేషన్ అధికారుల నుంచీ వసూళ్లు

- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఎస్‌బీ అధికారి నిత్యం ఆయా స్టేషన్లలోని ఎస్‌బీ సిబ్బంది ద్వారా అధికారులు, సిబ్బంది అవినీతిపై సమాచారం తెప్పించుకుని ఎస్పీ కార్యాలయంలో కీ రోల్ పోషించే మరో వ్యక్తితో కలిసి వసూళ్లకు పాల్పడ్డారని తెలుస్తోంది. అవినీతికి పాల్పడుతున్న స్టేషన్ అధికారులను పిలిపించి వారి వద్ద నుంచి భారీగా దండుకుని జేబులు నింపుకున్నారనే విమర్శలూ ఉన్నాయి.

దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిని అడ్డుపెట్టుకుని..

ఎస్‌బీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఆ విభాగంలోనే దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిని అడ్డుపెట్టుకుని రేషన్ మాఫియా, సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేయడంతోపాటు నగరంలో ప్రముఖులు ఉండే ఒక స్టేషన్ పరిధిలో పేకాట ఆడించినట్లు సమాచారం. లాలాపేట పరిసర ప్రాంతాల్లో ఉండే సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడితో సదరు ఎస్‌బీ అధికారులు నిత్యం టచ్‌లో ఉండేవారని, నగరంలోని మిగతా వారి నుంచి వసూలు చేసి అధికారులకు అందజేసేవారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటూ.. వీఆర్‌కు వెళ్ళిన నరసింహారావుతో ఆయనపైన అధికారులు, తోటి ఉద్యోగిపైనా ఎన్నో ఆరోపణలు ఉన్నాయని తెలుస్తోంది. ఫలితంగా దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిపైనా అధికారులు దృష్టి సారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవినీతిపరుల్లో భయం

ఉన్నతాధికారుల విచారణతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇన్నాళ్లూ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి నిలువుదోపిడికి సహకరించిన పలువురు అధికారులు, సిబ్బందిలో భయం పట్టుకుంది. విచారణలో ఎవరి పేర్లు బయటకు వస్తాయోనని బెంబేలెత్తుతున్నారు. మరి ఉన్నతాధికారులు ఎవరెవరి నిగ్గుతేలుస్తారో? ఎలాంటి చర్యలు తీసుకుంటారో? వేచి చూడాలి.

ఎస్‌బీపై విచారణకు ఏఎస్పీ నియామకం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ అధికారిగా అదనపు ఎస్పీ (ఏఎస్పీ) శ్రీనివాసరావు(క్రైం)ని నియమించి విచారణ చేయిస్తున్నట్లు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం జరిగిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. ఏఎస్పీ విచారణ నివేదిక ప్రకారం అవినీతి ఆరోపణలు రుజువైతే, ఏ స్థాయి అధికారినైనా, సిబ్బందినైనా ఉపేక్షించే ప్రశ్నేలేదని, శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా డొక్కా



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షునిగా డొక్కా మాణిక్యవరప్రసాద్ నియమితులయ్యారు. కొత్త కమిటీ నియామకమూ జరిగింది. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉపాధ్యక్షులుగా వి.రజనీకాంత్ (మంగళగిరి), అంగడి శ్రీనివాసరావు (గుంటూరు వెస్ట్), షేక్ మస్తాన్‌వలి (తాడికొండ), ప్రధాన కార్యదర్శులుగా ఈదులమూడి డేవిడ్‌రాజు (మంగళగిరి), జొన్నల శివారెడ్డి (తెనాలి), షేక్ నూరిఫాతిమా (గుంటూరు తూర్పు), పాలపర్తి రఘు (తాడికొండ), దాసరి జాన్‌బాబు (గుంటూరు తూర్పు), ట్రెజరర్‌గా కొండమడుగుల శ్రీనివాసరెడ్డి (పొన్నూరు), కార్యదర్శులుగా అమర వెంకటనాగేశ్వరరావు (మంగళగిరి), గుంజర ప్రభుదాసు (గుంటూరు వెస్ట్), దేవరపల్లి కిషోర్‌కుమార్, కుక్కల ముక్తేశ్వరరావు (తెనాలి), పల్లా శ్రీనివాసరావు (గుంటూరు తూర్పు), నాదెండ్ల రామచంద్రయ్య (ప్రత్తిపాడు), ఎం.ఎస్.అసదుల్లా (ప్రత్తిపాడు), పెరికల జేమ్స్ ఇన్నయ్య (తాడికొండ), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.సుధారాణి (మంగళగిరి), మొహమ్మద్ ఫిరోజ్ (మంగళగిరి), మేకా వెంకట్రామిరెడ్డి (మంగళగిరి) లచ్చి తులసి దాస్ (మంగళగిరి), గుంటూరు వెస్ట్ నియోజకవర్గానికిచెందిన వడ్లమూడి రమణ, రామిశెట్టి జోత్స్న, నిమ్మరాజు శారద, షేక్ ఖాజా మొహిద్దీన్, మర్రి వెంకట్రావులను నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తెనాలి నియోజకవర్గానికి చెందిన షేక్ మొహమ్మద్ సాధిక్, కొమ్ము బిక్షాల్‌రాయల్, పోతిరెడ్డి హేమలత, గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి షేక్ మస్తాన్‌షరీఫ్, చిలుకా రమేష్, తోటకూర స్వర్ణలత, తుమ్మేటి శ్రీనివాసరావు, డాక్టర్ మందపాటి కృష్ణారెడ్డి నియమితులయ్యారు. తాడికొండ నియోజకవర్గం నుంచి ముత్యాల బాలస్వామి, కొలికొండ వెంకటేశ్వరరావు, షేక్ గండికోట అబ్దుల్ రసూల్, తమనపల్లి శాంతయ్య, చేవూరి రామోహన్‌రెడ్డి, పొన్నూరు నియోజకవర్గానికి సంబంధించి మురికి జాకబ్ పాల్, ఆరేటి మధు, ఎం.ఎ.మహమూద్, పిల్లి మాణిక్యారావు, కారుమూరి రాజేంద్ర, డాక్టర్ కొమెర రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి టి.ఏడుకొండలు, పిల్లి నాగేశ్వరరావు, పాటిబండ్ల కవిత, నూరుబాషా మాబుసుభాని, కె.ఉదయభాస్కర్ (మంగళగిరి), నారదాసు వీరమణీంద్ర (గుంటూరు వెస్ట్)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పెళ్లి పీటలెక్కాల్సిన యువతి మృతి

మార్టూరు: రెండురోజుల్లో పెళ్లి పీటలెక్కాల్సిన యువతి వైద్యం వికటించి మరణించిన ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం జరిగింది. ఓ మెడికల్ షాపు యజమాని చేసిన వైద్యం వికటించిందని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా జే పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ గోపమ్మ, గాలయ్య దంపతుల కుమార్తె హారిక (19)కి ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన యువకుడితో ఈనెల 26న శనివారం రాత్రి పెళ్లి చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. ఈ క్రమంలో హారిక తనకు నీరసంగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో గురువారం ఉదయం కోలలపూడి గ్రామంలో ఉన్న హారిక మేనమామలు వైద్యం చేయిస్తామని పిలిపించారు. మెడికల్ షాపు నిర్వహిస్తున్న సాదినేని వెంకటేశ్వరరావు ఓ యువతి సహాయంతో తన షాపు పక్కనే వైద్యం చేస్తున్నాడు. ఒంట్లో నలతగా ఉన్న హారికను వెంకటేశ్వరరావు వద్దకు బంధువులు పంపించడంతో మొదట ఒక సెలైన్ ఎక్కించారు. రెండో సెలైన్ ఎక్కించే క్రమంలో సెలైన్ బాటిల్‌లో వెంకటేశ్వరరావు ఓ ఇంజక్షన్ చేశాడు. ఆ తర్వాత కొంత సేపటికి హారికకు ఫిట్స్ రావడంతో బంధువులు కారులో మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా హారిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ హారికను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని గురువారం రాత్రి స్వగ్రామం ముప్పవరం తరలించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- వివిధ పథకాల ద్వారా ద్వైవార్షిక నగదు జమ
- 10,548 మందికి ప్రయోజనం
- రూ.11.50 కోట్ల మేర లబ్ధి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహరనాయుడు

గుంటూరు వెస్ట్: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నవరత్న సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపడుతోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4వ విడత ద్వైవార్షిక నగదు జమ కార్యక్రమం నిర్వహించారు. గత ఆరు నెలల్లో ఇచ్చిన పథకాల ద్వారా ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని అర్హులకు బటన్ నొక్కి నేరుగా నగదును జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ద్వైవార్షిక నగదు జమ ద్వారా జిల్లాలో 10,548 మందికి రూ.11.50 కోట్లు లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. అర్హులందరికీ ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం కలెక్టర్ , ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, శాసన సభ్యులు కిలారి రోశయ్య మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్తెర సురేష్, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అలాగే 9,706 మందికి పింఛన్‌లు, 8,372 మందికి రేషన్ కార్డులు, 2,713 మందికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు.

వివిధ పథకాల ద్వారా ద్వైవార్షిక లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూపాయల్లో)
విద్యాదీవెన	2,769	3,30,00,000
ఇన్‌పుట్ సబ్సిడీ	3,014	3,56,00,000
చేదోడు	1,120	1,12,00,000
ఈబీసీ నేస్తం	699	1,05,00,000
జగనన్న వసతి దీవెన	1,958	91,90,000
అమ్మ ఒడి	546	81,90,000
వైఎస్సార్ ఆసరా	438	72,18,000

అమ్మఒడి వచ్చింది



నాకు గతంలో అమ్మఒడి పథకం ద్వారా నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి వచ్చేది. గత ఏడాది సాంకేతిక కారణాలతో రాలేదు. ఇటీవల సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. వలంటీర్ వచ్చి వివరాలు రాసుకెళ్లారు. ఇప్పుడు నగదు జమ చేశారు. పింఛన్ కూడా వస్తోంది. అగ్రకులమైనా అర్హతను బట్టి అందరికీ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– కె.హేమలత, గుంటూరు

పథకాలే అన్నం పెట్టాయి



కరోనా క్లిష్ట సమయంలో పనులు లేవు. చేతిలో డబ్బులు లేవు. అప్పుడు జగనన్న ఇచ్చిన పథకాలే మాకు అన్నం పెట్టాయి. ఈ ప్రభుత్వం లేకపోతే మాలాంటి పేదలు ఎన్నో ఇబ్బందులు పడేవారం. ఇప్పుడు నాకు కొత్తగా జగనన్న ఆసరా ద్వారా నగదు బ్యాంకులో జమైంది. ఎక్కడా రూపాయి కూడా పెట్టకుండా పథకాలు నేరుగా అందుతున్నాయి. జగన్‌బాబును అల్లా కాపాడుతాడు.

– షేక్ నూర్జహాన్, గుంటూరు

చంద్రయాన్-3లో భాగస్వామి కావడం ఆనందం

- భారతీయుడిగా గర్విస్తున్నా
- భవిష్యత్తులో ఇతర గ్రహాలకూ వెళ్లే అవకాశం
- అంతరిక్ష శాస్త్రవేత్త, ఏటీఎల్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో డాక్టర్ పావులూరి సుబ్బారావు

తెనాలి: చంద్రయాన్-3 విజయోత్సవాన్ని దేశంలోని సామాన్యులూ ఆస్వాదిస్తున్నారని తెనాలికి చెందిన ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, హైదరాబాద్ కేంద్రంగా గల అనంత్ టెక్నాలజీస్ (ఏటీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు చెప్పారు. భారతదేశం అగ్రరాజ్యాల సరసన నిలిచిందని చెప్పుకోవటం కాదు.. మనదీ అగ్రదేశమేనన్న భావనకు రావాలని అభిప్రాయపడ్డారు. ఇస్రో లాంచ్ వెహికిల్స్, శాటిలైట్ మిషన్స్‌లో మూడు దశాబ్దాలుగా అనుబంధం కలిగిన ఏటీఎల్ తాజాగా చంద్రయాన్-3లోనూ భాగస్వామ్యం వహించింది. చంద్రయాన్-3 లాంచ్ వెహికిల్ (ఎల్‌వీఎం)లోనూ ఇందుకు కావాల్సిన ఆన్‌బోర్డ్ కంప్యూటర్స్, నావిగేషన్ సిస్టమ్, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, టెలిమెట్రి, పవర్ సిస్టమ్స్ తదితర ఏవియానిక్స్ ప్యాకేజెస్‌ను ఏటీఎల్ సమకూర్చింది. ఇప్పటివరకు 75 లాంచ్ వెహికిల్స్‌కు, 94 స్పేస్‌క్రాఫ్ట్‌కు జీరో లోపరహితమైన తయారీ మద్దతును ఇచ్చింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న డాక్టర్ సుబ్బారావు, గురువారం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు.

ఆత్మ విశ్వాసం పెరిగింది

దేశానికి స్వాతంత్య్రం సిద్ధించినపుడు పొందిన ఆనందాన్ని సామాన్యులు ఎలా ఆస్వాదించారో తెలీదుగానీ అంతకుమించిన సంతోషంతో ఇప్పుడు పొంగిపోతున్నట్టు సుబ్బారావు చెప్పారు. స్వామి వివేకానంద చెప్పినట్టు మనలోని ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరత, ధైర్యం, స్థైర్యం మరింతగా పెరిగాయన్నారు. చంద్రుడు తన కక్ష్యలో ఎలా ప్రయాణిస్తాడు అనేది పురాణాల్లోని చూశామని, ఇప్పుడు నేరుగా చూడగలగటం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. ఇంతవరకు అమెరికా కూడా యత్నించని చంద్రుడి దక్షిణ ధ్రువంపై మన విక్రమ్ ల్యాండర్ కాలుమోపిందన్నారు. చంద్రుడిపై ఎక్కడ దిగాలనేది నిర్ణయించేందుకు చంద్రయాన్-1 తోడ్పడిందని డాక్టర్ సుబ్బారావు గుర్తుచేశారు. చంద్రయాన్-2 ప్రయోగంలో చివరి నిమిషంలో సమస్య తలెత్తినా, ఆ ప్రయత్నం నుంచి సేకరించిన సమాచారంతో మరింత జాగ్రత్తలతో చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతమైందని పేర్కొన్నారు. చంద్రుడిపై స్థావరం ఏర్పాటుకు మార్గం చిక్కిందన్నారు. దక్షిణ ధ్రువంలో నీరు కూడా ఉంటుందని ఇస్రో భావిస్తోందని చెబుతూ, ఆ ప్రయోగాలతోపాటు మరికొంచెం రిస్క్ చేయగలిగితే మిగిలిన గ్రహాలకు ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. తమ సంస్థకు తిరువనంతపురంలోని యూనిట్ ఫ్యాబ్రికేషన్, అసెంబ్లీ, టెస్టింగ్, అధునాతన కంప్యూటర్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ ప్యాకేజీలను లాంచింగ్ వెహికల్స్‌కు అందిస్తుండగా, బెంగళూరులోని ఫెసిలిటీ ఉపగ్రహాల తయారీకి అనువైనదిగా డాక్టర్ సుబ్బారావు వివరించారు. చంద్రయాన్-3 వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వామి కావటం భారతీయుడిగా గర్విస్తున్నానని చెప్పారు.



తెనాలిలో విద్యార్థుల మానవహారం

జయహో చంద్రయాన్

చంద్రయాన్-3 విజయవంతం నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయ పతాకాలతో కవాతు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్



పొన్నూరులో జాతీయ పతాకంతో...

ఖరీఫ్ ధాన్యం సేకరణలో కొత్త పద్ధతులు

- రైతు కష్టాన్ని దోచుకోనివ్వం
- రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు
- నాలుగు ప్రభుత్వ శాఖలతో ప్రత్యేక బృందాలు
- జాయింట్ కలెక్టర్ రాజకుమారి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: 2023–24 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం పండించిన రైతుల కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కాలనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణం సేకరణలో ప్రత్యేక విధానాలు అమలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి సివిల్ సప్లైస్ కమిషనర్ అరుణ్ కుమార్, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్ నుంచి రాజకుమారి పాల్గొన్నారు. అనంతరం జేసీ అధికారులతో మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర ఏ–గ్రేడ్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183గా ప్రభుత్వ నిర్ణయించిందని పేర్కొన్నారు. జిల్లాలో 21 రైస్ మిల్లులను గుర్తించామని పేర్కొన్నారు. తూనికలు కొలతలు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, సివిల్ సప్లైస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ బృందాలు ఈ నెలాఖరులోపు తనిఖీలు నిర్వహించి రిపోర్ట్ పంపిస్తాయన్నారు. జిల్లాలోని 163 రైతు భరోసా కేంద్రాలను 65 క్లస్టర్లుగా విభజించి ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని, నవంబర్, డిసెంబర్ నెలల్లో కొనుగోలు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ముందుగానే అవసరం మేరకు గన్నీ బ్యాగులు తహసీల్దార్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి మండల ప్రధాన కార్యాలయంలో ఉంచుతామని వివరించారు. ప్రతి క్లస్టర్ వద్ద శిక్షణ పొందిన సిబ్బందితోపాటు టెక్నికల్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ధాన్యం తరలించే ప్రతి వాహనానికీ జీపీఎస్ ట్రాకర్ అమరుస్తామని వెల్లడించారు. రైస్ మిల్లులో బియ్యం కొలతల సమయంలో సీసీ కెమెరాలు అమరుస్తామని, వాటిని జిల్లా కార్యాలయంతో పాటు కమిషనరేట్‌కు అనుసంధానం చేస్తామన్నారు. డీఎస్ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేకులపై కఠినంగా వ్యవహరిస్తాం

- హెచ్చరించిన ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్
- నేరాలపై సమీక్ష
- బాధితులతో మర్యాదగా మెలగాలంటూ సిబ్బందికి సూచన



సీఐతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ హెచ్చరించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో గురువారం జరిగిన నేర సమీక్ష జరిగింది. దీర్ఘకాల పెండింగ్ కేసులు, 2018 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లల్లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోక్సోయాక్ట్, మహిళలు, రోడ్డు ప్రమాదాలు, అదృశ్యాలు, చోరీల కేసుల దర్యాప్తు వేగవంతంగా చేపట్టాలని, వీలైనంత త్వరగా కేసులను ఛేధించాలని ఆదేశించారు. ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వారి సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే చట్ట పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధలను చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులతో ఏ ఒక్కరూ అనుచితంగా మాట్లాడవద్దని చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. గంజాయి రవాణా, క్రయ విక్రయాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జైళ్ల నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘాతోపాటు ఎప్పటికప్పుడు వారి కదలికలు గమనించాలని సూచించారు. దొంగతనాలు ఛేధించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలన్నారు. నేరస్తులు వదిలేసిన ఆధారాలు, సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా చోరులను అరెస్ట్ చేసి, దొంగలించిన సొత్తు పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులు అదృశ్యమైనట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే అలసత్వం చూపించవద్దన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పూర్తి వివరాలు సేకరించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఎస్పీలు ఎన్.షెల్కే (గుంటూరు తూర్పు), శ్రీనివాసరావు (క్రైం), కె.శ్రీనివాసరావు (ఎల్/ఓ) డీఎస్.మహేష్ (ఎస్ ఈబీ), కె. కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు మహబూబ్‌బాషా (దక్షిణ), పోతురాజు (తూళ్లూరు), రాంబాబు (ఉత్తర), ఉమా మహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), జనార్ధన్‌రావు (తెనాలి), బాలసుందరరావు (ట్రాఫిక్), కేసీహెచ్. రామారావు (దిశ), శ్రీనివాస్‌రావు (డీసీఆర్‌బీ), విజయశేఖర్ (ఎస్సీ, ఎస్టీ), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), సీఐలు బాలసుబ్రమణ్యం (డీసీఆర్‌బీ), శ్రీనివాసరావు (ఎస్‌బీ), ఆర్‌ఐలు, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శుభప్రదం.. వరలక్ష్మీ వ్రతం

- నేడు శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు
- కళకళలాడుతున్న పూలు, పండ్ల మార్కెట్లు



సత్తెనపల్లిలో పూలదుకాణం వద్ద సందడి

సత్తెనపల్లి: మాసాలన్నింటిలోనూ మంగళప్రదమైనది శ్రావణమాసం. ఈ మాసంలో శ్రావణలక్ష్మి సర్వాభరణాల అలంకరణలో తేజోవంతంగా భక్తులకు సాక్షాత్కరిస్తుంది. ముత్తైదువుల మనోభావాలకు, సంపద, సౌభాగ్యాలకు ఈ మాసం మహోదయం. అత్తవారిళ్లలో కొత్త కోడళ్ల కొంగొత్త ఆశలకు ఈ మాసం ఆశాజనకం. ఆషాఢం అడ్డంకులు అధిగమించాక కొత్త దంపతుల ఆనందప్రదమైన జీవితాలకు చంద్రోదయం. మహిళలకు శుభప్రదమైన శ్రావణమాసంలో మంగళ, శుక్రవారాల్లో ముత్తయిదువులు ఇళ్లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. శ్రావణమాసానికి పదిహేను రోజుల ముందు నుంచే వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడతాయి.

నూతన వస్తువులు, వస్త్రాలతో సందడి

వివాహితలు విధిగా వారి స్తోమతను బట్టి కొత్త చీరలు కొని, శ్రావణ లక్ష్మికి చూపించి కట్టుకుంటారు. బంగారం ధర చుక్కల్ని తాకుతున్నా కొని శ్రావణలక్ష్మికి చూపించి ధరించడం అనాదిగా వస్తున్న ఆచారం. శ్రావణమాసం సందర్భంగా పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, మాచర్ల, వినుకొండ పట్టణ ప్రాంతాల్లో వస్త్ర, బంగారు దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి.

మంగళగౌరీ వ్రతాలు

ఈ మాసంలో దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడుతుంటాయి. నిత్యం విశేష పూజలతోనూ, కుంకుమార్చనలతోనూ విరాజిల్లుతాయి. మంగళ,శుక్రవారాలు అమ్మవారికి మంగళగౌరీ వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి.

పిండి వంటల ఘుమఘుమలు..

ఈ మాసంలో ప్రతి ఇంట మంగళ, శుక్రవారాల్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉన్నా అనాదిగా వస్తున్న ఆచారాన్ని అంతా తప్పక పాటిస్తారు. ఇరుగు పొరుగు వారికి పంచుకుని సంప్రదాయాన్ని చాటుకుంటారు.

ధరలు పెరిగినా పూజలు తప్పవు



సంప్రదాయానికి చిహ్నంగా జరుపుకునే పండగల్లో వరలక్ష్మి వ్రతం ఒకటి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పండగలు చేసుకోవడం తప్పదు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా విపరీతంగా రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. దుస్తులు, లక్ష్మి కాసులు అన్నింటి ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

–పునులూరి లక్ష్మి, రఘురామ్‌నగర్

సంప్రదాయం ఉట్టిపడుతోంది



వరలక్ష్మి వ్రతం అంటేనే మహిళల పండగ. సంప్రదాయం ఉట్టిపడే ఈ పండుగ రోజుల్లో ప్రతి ఇల్లు ఒక దేవాలయంలా మెరిసిపోతుంది. మంగళ, శుక్రవారాల్లో మంగళగౌరీవ్రతాలతో ఆధ్యాత్మికత ఉట్టి పడుతోంది.

–చొప్పా శిరీష, నాగార్జుననగర్

ఫ్యామిలీ డాక్టర్‌తో సత్ఫలితాలు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతోపాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం గ్రామాల్లో సత్ఫలితాలనిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం జరిగే ప్రాంతాలకు ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలను వైద్య పరీక్షల కోసం తీసుకొస్తున్నారన్నారు. క్యాంప్‌లో ఎన్‌సీడీ వ్యాధులతోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. దీంతోపాటు ప్రతినెలా నిర్వహించే మెడికల్ క్యాంప్‌లో పేషెంట్స్ ఆరోగ్యాన్ని ఫాలోఅప్ చేస్తున్నారన్నారు. వైద్య సేవలతోపాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా ఇస్తున్నామన్నారు. గ్రామాల్లోని పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై రెండు గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో మంచి అభిప్రాయాలు వెల్లడయ్యాయన్నారు. సమావేశంలో జేసీ జి.రాజకుమారి పాల్గొన్నారు.

ఐఓసీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బి.అనిల్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాంగణంలో గురువారం నూతన భవన శంకుస్థాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బి. అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వ్యాపార విస్తరణ ప్రతిపాదనలకు అనుగుణంగా, తాడేపల్లిలో నెట్ జీరో ఎనర్జీతో స్టీల్ పార్కింగ్ జీ+2 అంతస్తులతో రూ.22 కోట్ల వ్యయంతో 2.42 ఎకరాల్లో నూతన భవాన్ని నిర్మించబోతు న్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం కింద విజయవాడ, సికింద్రాబాద్, విశాఖ, తిరుపతి, వరంగల్‌లో డివిజన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని, విజయవాడ డివిజన్ కార్యాల పరిధిలో 8 ఉమ్మడి జిల్లాల్లో 542 రిటైల్ పెట్రోల్ బంక్‌లు, 15 జిల్లాల్లో 333 ఇండేన్ ఎల్‌పీజీ పంపిణీదారులు, 37 లక్షల మంది వినియోగదారుల అవసరాలు తీరుస్తున్నామన్నారు. డివిజన్ కార్యాలయం ఇప్పటి వరకు విజయవాడ భారతీనగర్ భవనంలో కొనసాగుతూ వస్తోందన్నారు.

అంతరిక్ష పరిశోధనలకు భారత్ దిక్సూచి

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

సాక్షి, అమరావతి: ప్రపంచ చరిత్రలో చంద్రయాన్–3 విజయం మైలురాయిగా నిలిచిపోతుందని, అంతరిక్ష పరిశోధనల్లో భారత్ దిక్సూచిగా మారనుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. గురువారం తాడికొండలో నిర్వహించిన చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ భారతజాతి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మార్గదర్శి స్కూల్ ప్రిన్సిపాల్ గోపిదేశి శ్రీనివాస్ రావు, తాడికొండ వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 90.4 మి.మీ వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 90.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 3.4 మి.మీ వర్షం పడింది. సగటున 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు తూర్పులో 75.8, దుగ్గిరాల 48.6, చేబ్రోలు 24, గుంటూరు పశ్చిమ 22.8, తాడికొండ 16.4, తుళ్లూరు 13.8, వట్టిచెరుకూరు 13.2, మేడికొండూరు 8.8, మంగళగిరి 6.8, తాడేపల్లి 6.2, పెదకాకాని 5.6, పొన్నూరు 4.8, తెనాలి మండలంలో 4.2 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 24వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 127.5 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 110.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

బీడీఎస్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



నెట్టెం ప్రసన్న(ఫైల్)

ఉంగుటూరు: గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో బీడీఎస్ విద్యార్థిని హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన నెట్టెం ప్రసన్న(26) కళాశాలలో బీడీఎస్ 3వ సంవత్సరం పీజీ చదువుతోంది. ఇటీవల ప్రసన్న కాలుకు ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం ఆమె కోలుకోవడంతో రెండు రోజులుగా నెమ్మదిగా కళాశాలకు వెళుతోంది. గురువారం కళాశాలకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉంది. సాయంత్రం క్లీనింగ్ సిబ్బంది గదులను శుభ్రం చేసే క్రమంలో ఆ విద్యార్థిని ఉన్న గది తలుపులు ఎంతసేపటికి తీయకపోవడంతో యాజమాన్యానికి తెలిపారు. వారు తలుపులు తెరచి చూస్తే ఫ్యానుకు ఉరి వేసుకుని వెళాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31న ప్రతిభా పురస్కార మహోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: కేవీఆర్–జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 31న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా ఈనెల 31న సాయంత్రం 6 గంటలకు నరసరావుపేటలోని భువనచంద్ర ఆడిటోరియంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 34 మంది ఉపాధ్యాయ, అధ్యాపకులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభా పురస్కార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్, డీఈవో కె. శామ్యూల్ హాజరుకానున్నట్లు వివరించారు.

సోయాబీన్‌లో సస్యరక్షణ అవసరం

జిల్లా వనరుల కేంద్రం డీపీడీ రామాంజనేయులు

పెదనందిపాడు: సోయాబీన్‌లో సస్యరక్షణ పద్ధతులు అవసరమని, ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీపీడీ రామాంజనేయులు సూచించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని వరగాని గ్రామంలో సోయాబీన్ సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామాంజనేయులు మాట్లాడుతూ ఆత్మ తరుపున నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి రైతు భాగస్వాములేనని ఎవరికి ఎటువంటి సందేహాలున్నా వాటిని వ్యవసాయ శాఖ సిబ్బంది, శాస్త్రవేత్తలను ద్వారా తీర్చుకోవచ్చని ఆయన వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా సోయాబిన్ సస్యరక్షణ పద్ధతుల గురించి వారందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కిషోర్, శ్రీలత వాణి, ఏవో సుధారాణి, డీఆర్‌సీ ఏవో రాజవంశీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 32,242 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 30,853 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,242 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,582 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



తెలుగు సినిమా...

ఎత్తర జెండా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్‌ఆర్‌ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్‌ఆర్‌ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్‌ఆర్‌ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధం ధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.



విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)



ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)



కృతీసనన్ (మిమీ)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.

– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. – చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్‌ఆర్‌ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.

– రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. – కీరవాణి

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. – ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. – అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ సిక్సర్



కీరవాణి, శ్రీనివాస్ మోహనన్, కాలభైరవ, ప్రేమ్ రక్షిత్, కింగ్ సాల్మన్



దేవిశ్రీ ప్రసాద్, చంద్రబోస్, బుచ్చిబాబు, పురుషోత్తమాచార్యులు



కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

ఇదొక చరిత్ర

– నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.

– నవీన్ యెర్నేని, నిర్మాత

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.

– వై. రవిశంకర్, నిర్మాత

"నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి" అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. "రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం" అన్నారు.


– బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబియార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను – ఎంఎం శ్రీలేఖ

"ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం" అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ – "మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య– కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను" అన్నారు.



69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) – కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి– మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్‌ఆర్‌ఆర్ – ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప– దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్‌ఆర్‌ఆర్ –ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్‌ఆర్‌ఆర్ – కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్– కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్‌ఆర్‌ఆర్– కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్‌ఆర్‌ఆర్– శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్– హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ– హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి–హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్– తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్–హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ – మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి–హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ – సోనూ కేపీ (చవిట్టు మూవీ–మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి– హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా–మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా – ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి– హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ–హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో – గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్–ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్‌ఆర్‌ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ– బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్–హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కోకో–హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతీశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం–బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం–బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

